# లెస్ లగేజ్ - మోర్ కంఫర్ట్

"పరుపుచుట్టలు రెండు, ట్రంకు ఒకటి, ప్లాస్టిక్కు సంచులు రెండు, రైలు చెంబు ఒకటి, గొడుగు ఒకటి, ఫ్లాస్కు ఒకటి, మీల్స్ కారియర్ ఒకటి, రెండూ ఒకటీ మూడూ, మూడూ రెండూ అయిదూ, అయిదూ ఒకటీ ఆరూ, ఆరూ ఒకటీ ఏడూ, ఏడూ ఒకటీ ఎనిమిది - ఎనిమిది ఒకటీ తొమ్మిదీ - మొత్తం తొమ్మిది సామాన్లు. జాగ్రత్తండీ బాబూ! పరుపు చుట్టలు బెర్త్‌పైన పెట్టండి. ట్రంకు సీటుక్రింద దూర్చండి. అదిగో ఫ్లాస్కను సీటుపైన పెట్టేస్తున్నారు, పిల్లలెవరైనా తాకితే కింద పడిపోదూ! తీసిపైన పెట్టండి. రైలుచెంబు కేమొచ్చిందిలెండి... అదెక్కడున్నా పర్వాలేదు. అమ్మయ్య! ఎలాగైతేనేం, తావుదొరికింది. ఖాళీ వుండదేమో ననుకున్నాను. తిరుపతిలో బ్రహ్మోత్సవాలుగదండీ వెళ్ళొచ్చే జనంతో బండి మరింత రద్దీగా వుండాల్సింది. ఇలాగే ఒకసారి ఏమయిందంటే..."

"హోల్డాన్ జానకీ హోల్డాన్" - ఆక్రోశించి నట్టుగా అరిచాడు సీతాపతి. "తావు దొరికిన ఆనందంలో నువ్వు ఉబ్బి తబ్బిబ్బు అయిపోతే ఎలా? పిల్లలందరూ పెట్టెలో కెక్కారో లేదో చూడు..."

"అవును నిజమేనండీ! సామాన్లెక్కడ పడేస్తే అక్కడే వుంటాయి. పిల్లలలా కాదే! అందులోనూ మనపిల్లలా! వీళ్ళను పైనబెడితే వానలు పడవు, కింద పెడితే పంటలు పండవే! ఒరే చిట్టీ రాజా ఏరీ? పద్మా, బుజ్జీ ఎక్కడుందే! అన్నట్టు రవీ రాధా ఏమయ్యారు? ఏమండీ రైలొచ్చే సరికి రవీ రాధా మిఠాయి బండి వైపు వెళ్ళారుగదూ! తిరిగొచ్చారో లేదో చూచుకున్నారా..." తొందర తొందరగా పెట్టెంతా కలయజూస్తూ కంగారు పడిపోసాగింది జానకి.

"తిరిగొస్తే మాకివ్వాల్సి వస్తుందేమోనని వాళ్ళా బండి దగ్గరే వుండిపోయారేమోనే అమ్మా!" సందేహం వెలిబుచ్చింది పద్మ.

"నోర్ముయ్, నీకెప్పుడూ తిండిరంధే!" కూతుర్ని గదమాయించి సుడిగాలిలా తలుపు దగ్గరికొచ్చి పడింది జానకి. ఆపాటికే సీతాపతి కనపించని పిల్లల కోసం ప్లాట్‌ఫారమంతా గాలించేస్తున్నాడు.

"ఏమిటండీ మీరు! బండి బయలుదేరే టయిమైపోతూవుంటే యింకాప్లాట్‌ఫారంపైన పచారుచేస్తున్నారు. బాబూ! ప్రక్క పెట్టెలోకేమయినా ఎక్కారేమో చూడండి..." హెచ్చరించింది జానకి.

ఈవైపున, ఆవైపున రెండు మూడు పెట్టెలు గాలించి ఓమూలగా బైఠాయించి పకోడీలుతినే పారవశ్యంలో నిమగ్నులైవున్న పిల్లల నిద్దర్నీ బరబరా లాక్కొచ్చినంత పనిజేసి, వాళ్ళను కాస్తా తాము కూర్చున్న పెట్టెలోకి చేరవేశాడు సీతాపతి.

"ఇదేమైనా మన యిల్లనుకున్నారా! రైలుబండి కదూ! ఎక్కడబడితే అక్కడ కూచుంటారా? పకోడీలు దొరగ్గానే బ్రహ్మాండమైపోయిందా?" అంటూ రవికి రాధకు చెరొక రెండు మొట్టికాయలు ప్రసాదించింది జానకి.

"చూడు జానకీ! ఇది మన యిల్లు గాదని నువ్వయినా గుర్తించినందుకు నాకు మహదానందంగా వుంది. అందువల్ల ఇక్కడ యిల్లు పీకి పందిరేసే ప్రయత్నాలు జరగకుండా వుండాలని నా కోరిక. సామాన్లు తొమ్మిది, బిడ్డలారుమంది, మనమిద్దరం... మొత్తం శాల్తీల సంఖ్య పదిహేడు. వీటిలో ఏ ఒక్కటి చేజారిపోయినా, అది మనకు నష్టంగా మాత్రమేగాదు, నామర్దాగా గూడా వుంటుంది. పైగా దగ్గరి బంధువుల యింట్లో పెండ్లికి వెళ్తున్నామాయె! ఏదైనా అవకతవక జరిగితే అందరూ మనల్ని చూచి నవ్వుకుంటారు..." అన్నాడు సీతాపతి.

"భలేవారే! ఎవరో నవ్వుకుంటారని, లగేజీ గిగేజీ, బిడ్డలు గిడ్డలూ ఏమీ లేకుండా లింగూ లిటుకూ అంటూ యిద్దరమే వెళ్ళాలంటారా? బాగుందిలెండి మీవరస! తొమ్మిదిమందిమి వెళ్తున్నామా, మూడురాత్రులుండాలిసొస్తుందా, పైగా చలికాలమా, పడుకోడానికి, కప్పుకోదానికీ బట్టలుండొద్దూ! రోజు కోసారైనా దుస్తులు మార్చుకోవద్దూ! పోతే దాహంవేస్తే మంచినీళ్ళు త్రాగడానికని ఓరైలు కూజా, వానొస్తే తలదాచు కోవడానికోసం గొడుగు, తలనొప్పి రాకుండా గ్రుక్కెడు కాఫీ నోట బోసు కోవడానికి కొక ఫ్లాస్కూ యింకా సోపు, పౌడరు, టూత్‌పేస్టు, కుంకుమ డబ్బీ – యిందులో అవసరం కానిదేమిటో చెప్పండి చూద్దాం..."

అయితే భార్యతో వాదాన్ని పెంచుకునే ఆసక్తిగానీ ఓపిక గానీ లేకుండా సీతాపతి ముఖం చిట్లించుకుంటూ కిటికీవైపు తిరిగి కూచున్నాడు.

కొద్ది నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయిన తర్వాత "భలే భలే! చెట్లు పరుగెడుతున్నాయి" అంటూ చప్పట్లు కొట్టసాగాడు చిట్టి.

"చెట్లు కాదురా పరుగెత్తడం! రైలు పరుగెడుతోంది" అంటూ సవరించింది పద్మ.

"చెట్లు పరుగెత్తడం లేదట! ఇహిహీ" అంటూ పళ్ళికిలించాడు చిట్టి.

"అవున్రా చిట్టీ! సూర్యుడు గూడా యిలాగే మన కళ్ళకు కదులుతున్నట్టు కనిపిస్తాడు గదూ! అదేం లేదు. నిజానికి భూమే సూర్యుడి చుట్టూ తిరుగుతోందట!" తన పరిజ్ఞానాన్ని వెల్లడించింది రాధ.

చూస్తూ చూస్తూ వుండగానే చెట్లు, భూమి, రైలు, సూర్యుడు అనేవాటిలో కదిలేవేవీ, కదలనివేవీ అన్న విషయం పైన పిల్లల మధ్య చిన్నసైజు వాగ్యుద్ధం జరగసాగింది.

పిల్లల గొడవ పట్టించుకోకుండా సీతాపతి చుక్కలు క్రిక్కిరిసివున్న వినీలాకాశం వైపు చూడసాగాడు. అమ్మో, ఎన్ని చుక్కలు! భూమిపైన ఒక చదరపు అంగుళమయినా ఖాళీ లేకుండా మనుషుల్ని నిలబెడితే ఆ దృశ్యం యిలాగుంటుందేమో! కొంపదీసి అలాంటి రోజొకటి వస్తే? సీతాపతికి ఒళ్ళు గగుర్పొడిచింది.

రైలు ఏవేవో చిన్న స్టేషన్లలో ఆగి మళ్ళీ ముందుకు వెళ్ళిపోతోంది.

వచ్చే స్టేషనేదో, వెళ్ళిపోయిన స్టేషనేదో తెలుసుకోవడం కన్నా పిల్లల ధ్యాస ఆయా స్టేషన్ల ప్లాట్‌ఫారాల పైకి వచ్చిన చిరుతిళ్ళపైనే కేంద్రీకరించింది. రైలుబండి ఊయలూగుతున్నట్టుగా నడుస్తున్నదేమో, వాళ్ళు మెల్లమెల్లగా ఆవులింతల్లోకి దిగి ఎక్కడి వాళ్ళక్కడే నిద్రలోకి ఒరిగిపోయారు.

"ఏమండీ! ఈ రైలు ముదిగుబ్బ స్టేషన్లో ఎంత సేపాగుతుంది?" అంటూ ఒక సందేహం లేవదీసింది జానకి.

"ఎంతో సేపెక్కడ! రెండు మూడు నిమిషాలాగుతుందేమో గబగబా సామాన్లన్నీదించేయాలి. రైలాగగానే నేను ప్లాట్‌ఫారం పైకి దిగేస్తాను. నువ్వు కిటికీ గుండా సామాన్లన్నీ అందించేస్తే నేను ప్లాట్‌ఫారం పైన పెట్టేస్తాను..."

అర్థరాత్రికింకా ఓ గంట వుందనగా భార్యాభర్త లిద్దరు గూడా మాట్లాడుకోడం మానేసి క్రమక్రమంగా కునికిపాట్లు పడసాగారు. ఎక్కుడుదారిలో రైలు పెద్దగా రభస చేసుకుంటూ మంద మందంగా నడక సాగిస్తోంది. ఏదో స్టేషన్లో రైలాగినట్టు తోచి ఉలిక్కిపడ్డట్టుగా కళ్ళు తెరిచింది జానకి. దిగేవాళ్ళతో ఎక్కేవాళ్ళతో ప్లాట్‌ఫారం అప్పటికే

కోలాహలంగా వుంది. "ఇదిగో ఏమండీ మిమ్మల్నే! ఇదేం స్టేషనో చూడండి" అంటూ భర్తను కదిపి నిద్రలేపింది. కిటికీలోనుంచి తొంగిచూచిన సీతాపతి "అరరే! ముదిగుబ్బ కొచ్చేసినట్టున్నామే" అంటూ ఆదరబాదరగా క్రిందికి దిగివచ్చాడు.

"చూచారా, నేను చెప్పకుండావుంటే ఏమైవుండేది" అంటూ జానకి ఒక్కొక్కటిగా సామాన్లు అందింపసాగింది. ఒకటి రెండు అంటూ తొమ్మిదిదాకా లెక్కబెట్టుకుని లగేజినంతా ప్లాట్‌ఫారంపైకి చేరవేసిన సీతాపతి "రవీ రాధా పద్మా బుజ్జీ! అందరూ లేవండర్రా! స్టేషనొచ్చేసింది" అంటూ పెట్టె కీవలినుంచే కేక పెట్టాడు.

నిద్రమత్తులో వున్న పిల్లల్ని లేపి నిల్చోబెట్టి తీసుకొచ్చి ప్లాట్‌ఫారం పైన దిగబెట్టి, వారివెంట జానకి తానూ క్రిందికి దిగిందో లేదో, రైలు ముందుకు కదిలింది.

పిల్లలు కళ్లు నులుముకుంటూ "అమ్మా! వూరెక్కడే? కనిపించడం లేదు" అంటూ ఫిర్యాదు చేయడం మొదలెట్టారు.

"ఉండండుండండి, కూలీ లెవరైనా దొరుకుతారేమో చూస్తాను..." అంటూ సీతాపతి వెయిటింగు రూమువైపు దారితీశాడు.

సరిగ్గా ఆ సమయంలో ఉన్నట్లుండి "అమ్మా, రాజా ఏడీ?" అంటూ ఓ గావుకేక పెట్టింది రాధ.

సీతాపతి నిలువునా నీరైపోయాడు. జానకి నఖశిఖ పర్యంతమూ కంపించిపోయింది. పిల్లలయిదుగురూ ఏడుపు ముఖం పెట్టి ప్లాట్‌ఫారమంతా కలియజూడ సాగారు.

"ఇదేనా నువ్వు చేసే నిరవాకం! లగేజీ భద్రంగా దించమంటే ఒక బిడ్డను రైల్వే కంపార్టుమెంట్లోనే మరచిపోతావా? నీకు బుద్ధుందా? ఛీ, ఛీ, ఈ ప్రయాణానికి ఒప్పుకోవడమే నా బుద్ధి తక్కువ. పెళ్ళి సంబరమంతా నట్టేట కలిసినట్టయింది. ఇంక తల్లీ బిడ్డలందరూ కలిసి కట్టగట్టుకుని ఏడవండి" ముఖం కందగడ్డలా చేసుకొని మండిపోసాగాడు సీతాపతి.

"అయ్యయ్యో వాడు ముందుగానే దిగేశాడేమో ననుకున్నా నండి! సీటు క్రింద పడుకున్నాడేమో వంగి చూచుకోక పోవడం నా పొరపాటైపోయింది. బాబ్బాబూ! మీకు పుణ్యముంటుంది. వెళ్ళి స్టేషనుమాస్టరుగారికి రిపోర్టు చేయండి" అంటూ బ్రతిమలాడుకుంది జానకి.

మరేం కంగారు పడొద్దని సితాపతికి హితవు చెప్పి స్టేషనుమాస్టరుగారు ముందున్న స్టేషన్లకన్నింటికీ ఫోనుచేసి బిడ్డను జాగ్రత్తగా పెట్టెలోనుంచి, ఎదురుగా వచ్చే ఎక్స్‌ప్రెస్ బండిలో పంపించ వలసిందిగా కబురుపెట్టాడు.

"పరవాలేదు లెండి! ఇంకొక గంటసేపటిలో ఎక్స్‌ప్రెస్ వచ్చేస్తుంది. గార్డు మీ బిడ్డను తీసుకొచ్చి మీకు పదిలంగా అప్పగిస్తాడు. అందాకా మీరు మీ సరంజామానంతా తెచ్చుకొని యిక్కడ వెయిటింగ్ రూములోనే కూచోండి" అంటూ సలహా యిచ్చారు స్టేషనుమాస్టరుగారు.

సామాన్ల నన్నింటినీ వెయిటింగ్ హాలు మధ్య గుట్టలో పేర్చి పెట్టి, బిడ్డల్ని ఆ గుట్టచుట్టూరా పడుకోబెట్టి "యింత లగేజీవద్దంటే విన్నావుగావు. అఘోరించు" అంటూ భార్యపైన మళ్ళీ ఒకసారి నోరు చేసుకున్నాడు సీతాపతి.

"అవున్నాన్నా ఇందాక మనం కూర్చున్న రైలు పెట్టెలో గూడా ఆమాటే వ్రాశారు" అన్నాడు రవి.

"ఏమిట్రా అది?" విసుక్కుంటూ అడిగాడు సీతాపతి.

"లెస్ లగేజ్ మోర్ కంఫర్టు అని వ్రాశారుగా? నువ్వు చూడలేదా పద్మా!" చెల్లెల్ని గూడా అడిగిచూచాడు రవి.

"చూచానుగానీ, నాకేం అర్థంగాలేదు. అలాగంటే ఏమిటి నాన్నా?"

ఆ రైల్వేవాళ్ళు సూక్తికి శ్రద్ధగా టీకాతాత్పర్యాలు చెప్పే ఓపిక సీతాపతికి లేకపోయింది. అతడు దిగాలుపడిపోయి దిక్కులు చూస్తూ కూర్చున్నాడు.

"నా బిడ్డ నాకు దక్కితేచాలు భగవంతుడా!" అని వెయ్యి దేవుళ్ళకు మ్రొక్కుకుంటూ రానున్న ఎక్స్‌ప్రెస్ బండి కోసం వెయ్యికళ్ళతో వేచి చూడసాగింది జానకి.

(... ఆంధ్ర లలిత కళా సమితి సావనీరు)

❀ ❀ ❀